

## హ్యుందాయ్ కార్ల కంపెనీ యాజమాన్యం

శుక్రవారం హైదరాబాద్‌లో తమ ప్రతినిధులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు

పూర్తి వివరాలు మెయిన్ లో




# మనం

# మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

శనివారం । 17 । అక్టోబర్। 2026 పేజీలు: 11


# నందిగామలో గౌడ్ హాస్టల్‌కు కొత్త భవనం









3

- గౌడ్ హాస్టల్ నూతన భవనం ప్రారంభం
- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పలువురు నేతలు



ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో

# ఘనంగా బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతి మన గౌరవం బతుకమ్మ పండుగ మన ఆత్మీయతకు ప్రతీక

2

మనం న్యూస్ - సిద్దిపేట రిపోర్టర్ అక్టోబర్ 16: ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు.



# నిరుద్యోగ నిర్మూలనకు కాంగ్రెస్ పెద్దపీట

- రాష్ట్రంలో 120ఏటీసీ సెంటర్ల ఏర్పాటు
- 10వేల టీచర్ పోస్టుల భర్తీ పూర్తి
- త్వరలో గుండ్లమాచునూరుకు మినీ స్టేడియం
- రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి

2



# నిరుద్యోగ నిర్మూలనకు కాంగ్రెస్ పెద్దపీట

**-రాష్ట్రంలో 120ఏటీసీ సెంటర్ల ఏర్పాటు**

**-10వేల టీచర్ పోస్టుల భర్తీ పూర్తి**

**-త్వరలో గుండ్లమాచునూరుకు మినీ స్టేడియం**

**-రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి**






హత్నూర (మనం న్యూస్) అక్టోబర్ 16: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న క్రమంలో భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని, నిరుద్యోగ నిర్మూలకై రాష్ట్రంలో నూట ఇరవై ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చమని రాష్ట్ర ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.నిరుద్యోగ నిర్మూలనకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి పెద్దపీట వేస్తుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే 10వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని అన్నారు.మండలంలోని గుండ్లమాచునూర్ గ్రామంలో శుక్రవారం నాడు హానర్ ల్యాబొరేటరీ పార్మా పరిశ్రమ ఆర్థిక సౌజన్యంతో నిర్మించిన సీసీ రోడ్డు,బతుకమ్మ ఘాట్, చెరువు కట్టపై వీధి దీపాలను ప్రారంబించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారులు, పాలకవర్గసభ్యులు,గ్రామస్థులు చేసిన విజ్ఞప్తితో గుండ్ల మాచునూరు గ్రామ అభివృద్ధికి స్థానిక పరిశ్రమలు సిఎస్ఆర్ నిధులు ఇవ్వడం అభినందనీయమని మంత్రి వివేక్ అన్నారు. బతుకమ్మ ఘాట్ గొప్పగా నిర్మించుటలో తెలంగాణలోనే గుండ్లమాచునూర్ బెస్ట్ అని సర్పంచ్ శ్రీహరి కృషిని అభినందించారు.గ్రామస్థుల కోరిన విధంగా త్వరలో యువకులు, విద్యార్థుల సౌకర్యార్థం మినీ స్టేడియం మంజూరుకు కృషి చేస్తామని, మంజీర నది నుంచి ప్రారంభించి పల్వనూర్ వద్ద వదిలేసిన ఎత్తిపోతల పథకాన్ని, గుండ్లమాచునూర్ చెరువులోకి వచ్చేలా కృషి చేస్తామని అన్నారు. ఎల్నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గత ఏడాది కంటే ఈ ఖరీఫ్ సీజన్ లో 10వేల మెగావాట్ల అదనపు విద్యుత్ సరఫరా పెరిగిందన్నారు. వచ్చే జూన్ వరకు విద్యుత్ ను ఆదా చేస్తూ యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. ఇండ్లల్లో కూడా విద్యుత్ ను పొదుపుగా వాడాలని సూచించారు.మంత్రి రాకతో హత్నూర పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.సభకు సర్పంచ్ బి శ్రీహరి అధ్యక్షత వహించగా కళాకారుల బృందం చే గ్రామస్తులను అలరింప చేయడమైంది.ప్రారంభోత్సవానికి ముందు గ్రామ ప్రధాన కూడళ్లలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూల మాలలు వేసి మంత్రి వివేక్ నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు, అదనపు పోలీసు సూపరిండెంట్ చైతన్య రెడ్డి, తెలంగాణ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు మాజీ చైర్మెన్ వి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజక వర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఎస్ ఆంజనేయులు గౌడ్, హత్నూర పి ఏ సీ ఎస్ చైర్మెన్ దుర్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి శ్రీనివాస్ రెడ్డి,బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్,తహసీల్దార్ ఫర్హీన్ షేక్, అంబేద్కర్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొండాపురం జగన్,ఎస్ట్ర శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కే కృష్ణ ముదిరాజ్,మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ లు,ఉపసర్పంచ్ శంకర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు, గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

---

# ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో

# ఘనంగా బతుకమ్మ సంబరాలు





**- తెలంగాణ సంస్కృతి**

**మన గౌరవం బతుకమ్మ పండుగ**

**మన ఆత్మీయతకు ప్రతీక**



మనం న్యూస్ - సిద్దిపేట రిపోర్టర్ అక్టోబర్ 16: ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అందమైన పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయాల ప్రకారం అమ్మవారిని ఆరాధిస్తారని, భక్తిశ్రద్ధలతో పూజించే వారిని భగవంతుడు తప్పక అనుగ్రహిస్తాడని పేర్కొన్నారు.

తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు సిద్దిపేట జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, తెలంగాణ పల్లె సంస్కృతిని, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి.

తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన బతుకమ్మ పండుగ కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా, మహిళల ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు, మన సంస్కృతి పట్ల గౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రజల ప్రత్యేకత. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం తెలంగాణ జీవన విధానంలో అంతర్భాగంగా నిలిచింది.

సిద్దిపేట జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించాయి. పూలతో అలంకరించిన బతుకమ్మలతో ప్రాంగణం అందంగా ముస్తాబైంది. పండుగ వాతావరణం ఆహ్లాదాన్ని నింపగా, బతుకమ్మ వేడుకలు తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక వారసత్వాన్ని మరోసారి గుర్తుచేశాయి.

బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని, మన సంస్క ృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక వేడుకలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన ప్రాంతీయ కళలు, ఆచారాల పట్ల యువతలో ఆసక్తిని పెంచుతాయి.

తెలంగాణ నేలతో, ప్రకృతితో, పూలతో విడదీయలేని అనుబంధాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటినట్లయింది. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్లో జరిగిన బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతి వైభవానికి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయి.

అనంతరం అమ్మవారి స్తోత్రాలను పఠించారు. బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన శాఖలకు బహుమతులు ప్రదానం చేశారు. రెవెన్యూ శాఖకు మొదటి బహుమతి, డీఆర్డీఓకు రెండో బహుమతి, పట్టుపరిశ్రమల శాఖకు మూడో బహుమతి అందజేశారు. ఉద్యానవన శాఖ, టీఎన్జీఓలకు కన్సొలేషన్ బహుమతులు ప్రదానం చేశారు. బాలసదనం నుంచి బతుకమ్మలను తయారు చేసి తీసుకువచ్చిన చిన్నారులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.









# నందిగామలో గౌడ్ హాస్టల్‌కు కొత్త భవనం

- గౌడ్ హాస్టల్ నూతన భవనం ప్రారంభం
- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పలువురు నేతలు







పటాన్చెరు, అక్టోబర్ 16 (మనం న్యూస్): పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌడ్ హాస్టల్ భవనాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు. భవన ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులతో పాటు పలువురు నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను గౌడ్ హాస్టల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, టీఎస్ టీసీఎఫ్సీ చైర్మన్ మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, శేరిలింగంపల్లి ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్, టీ. వీరేందర్ గౌడ్, పల్లె రవి, పటాన్చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, నందిగామ సర్పంచ్ విక్రమ్ గౌడ్, గౌడ్ హాస్టల్ అధ్యక్షుడు చక్రవర్తి గౌడ్, హాస్టల్ భవన స్థలదాత దొంతి లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గౌడ్ హాస్టల్ కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు.

# పార్టీ జెండాలు పక్కనపెట్టి.. సమాజ అభ్యున్నతికి ఐక్యంగా కదలాలి

**రజకుల సంక్షేమమే లక్ష్యంగా పోరాడాలి**

**రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షుడిగా బండి మల్లేశం ఏకగ్రీవ ఎన్నిక**



నంగునూరు, అక్టోబర్ 16 మనం న్యూస్:- సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో రాజకీయ పార్టీలకు అతీతంగా రజక సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ గణేశ్ పిలుపునిచ్చారు. జాతి ఐక్యతే బలమని, హక్కుల సాధనకు సంఘటిత పోరాటమే మార్గమని పేర్కొన్నారు. నంగునూరులో శుక్రవారం నిర్వహించిన రజక సంఘం మండల కమిటీ ఎన్నికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందుతున్నా రజకుల జీవితాల్లో ఆశించిన మార్పు రావడం లేదని విజయ గణేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా రజకుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. రజకుల సంక్షేమం కోసం ప్రతి రజక బిడ్డ కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య కోరారు. రాజకీయాలకు అతీతంగా సమాజ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.నవంబరు నెలలో నిర్వహించనున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాలుగో మహా సభను విజయవంతం చేయాలని విజయ గణేశ్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రజకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జాతి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. రజకుల సంక్షేమం, హక్కుల సాధన కోసం సమష్టిగా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో నంగునూరు మండల అధ్యక్షుడిగా బండి మల్లేశం (సిద్ధన్నపేట) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా గుండెల్లి మల్లయ్య(ఖానాపూర్), సుంకరి మహాదేవ్ (ఘనపూర్) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వర్కోలు బాగయ్య, పావురాల సాయి చరణ్, అనరాజు చందు (నంగునూరు) నియమితులయ్యారు.

ప్రధాన కార్యదర్శిగా పులిపాక సంపత్ (నాగరాజుపల్లి), కోశాధికారిగా కంచర్ల రాజు (కోనాయిపల్లి), వర్కింగ్ ప్రెసిడెంట్గా నర్మెట లక్ష్మణ్ (ఆంక్షపూర్), కార్యదర్శిగా బస్వరాజు భాస్కర్ (కొండంరాజుపల్లి) నియమితులయ్యారు. యూత్ అధ్యక్షుడిగా అనురాజు మహేశ్ (సిద్ధన్నపేట), యూత్ ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రామ్ (బద్దిపడగ), యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్గా భాస్కర్ (ఆంక్షాపూర్) ఎంపికయ్యారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా బస్వరాజు రాములు (పాలమాకుల), జిల్లా కన్వీనర్గా అనరాజుల నాగరాజు (నంగునూరు) నియమితులయ్యారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల సత్య స్వామి, జిల్లా మీడియా కన్వీనర్ జూపల్లి నర్సింలు, మండలంలోని వివిధ గ్రామాల రజకులు పాల్గొన్నారు.



# సరస్వతి అమ్మవారి సాక్షిగా విద్యార్థులకు అక్షర కానుకలు

**పుస్తకాలు, పెన్నులు, పలకల పంపిణీ చేసిన బెదురు నర్సింలు**

నంగునూరు, అక్టోబరు 16 మనం న్యూస్ :- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో దేవీ శరన్నవ రాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి సరస్వతి అవతారం సందర్భంగా సిద్ధన్నపేట విద్యార్థులను ప్రోత్సహం అందించేందుకు యువసేన యూత్ అసోసియేషన్ ముందడుగు వేసింది. ఆధ్యాత్మిక వేడుకకు సేవా కార్యక్రమాన్ని జోడించింది. బెదురు నర్సింలు ఆర్థిక సాయంతో చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచేలా పుస్తకాలు, పెన్నులు, పలకలను పంపిణీ చేసింది. యువసేన యూత్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెదురు నర్సింలు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలను అందజేశారు. సరస్వతి అమ్మవారి అవతారాన్ని పురస్కరించుకుని విద్యాసామగ్రి పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల అభ్యున్నతికి విద్య ఎంతో కీలకమని ఈ కార్యక్రమం చాటి చెప్పింది. చిన్నారులకు అవసరమైన విద్యాసామగ్రిని అందించడం ద్వారా వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందించే ప్రయత్నం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. మతపరమైన వేడుకలతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ కార్యక్రమం సందేశం ఇచ్చింది. యువసేన యూత్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల పట్ల సామాజిక బాధ్యతను చాటి చెప్పింది.

# లైఫ్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

గజ్వేల్ అక్టోబర్ 16 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలోని లైఫ్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. రకరకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించిన అనంతరం బతుకమ్మ చుట్టూరా కోలలాటలు చప్పట్లతో ఆనందంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లైఫ్ క్యూర్ హాస్పిటల్ యజమాని డాక్టర్ చైతన్య ఆనంద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లైఫ్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని సిబ్బందితోపాటు చుట్టుపక్కల వారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మహిళలకు ఎంతో ఇష్టమైన ఈ పండుగను నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమైన ఆనందాన్ని వ్యక్తం చేశారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి మహిళలు ఉదయం నుండి ఈ బతుకమ్మలను తయారు చేస్తారని సాయంత్రం ఒక చోట చేరి బతుకమ్మ పాటలతో అందంగా ఆనందంగా కార్యక్రమం నిర్వహిస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది అనూష, సంగీత, రమ్య, పల్లవి,సౌమ్య,రాజకల, సుజాత, హంస తదితరులు పాల్గొన్నారు.





## క్రేన్ ఢీకొని కూలీ మృతి

వర్గల్ అక్టోబర్ 16(మనం న్యూస్): మండలం గౌరారం గ్రామ శివారులో గల వర్గల్ కమాన్ బస్ స్టాప్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. క్రేన్ ఢీకొని ఓ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి గౌరారం పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.గజ్వేల్ కు చెందిన గుండ్ల నరేష్ (38) తన భార్య నవనీతతో కలిసి గౌరారం గ్రామంలోని శ్రవ్య టెక్స్ టైల్స్ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు.రోజూ మాదిరిగానే రోజువారీ విధులు ముగించుకుని శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటలకు గౌరారం గ్రామంలోని వర్గల్ కమాన్ బస్ స్టాప్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో వర్గల్ నుంచి గౌరారం వైపు వస్తున్న క్రేన్ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి నరేష్ ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేష్ తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుకొనసాగిస్తున్నారు.

==========



## బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా రాజు నాయక్

అక్కన్నపేట అక్టోబర్ 16 (మనం న్యూస్) : బీఆర్ఎస్ అక్కన్నపేట మండల అధ్యక్షుడిగా పెద్ద తండాకు చెందిన గుగులోతు రాజు నాయక్ నియమితులయ్యారు. ఆయన నియామకంపై గిరిజన సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో రాజు నాయక్ చురుకుగా పాల్గొన్నారని, గత 20 ఏళ్లుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు పార్టీ బాధ్యతలు అప్పగించిన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్కుమార్కు గిరిజన సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాజు నాయక్ నాయకత్వంలో మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతున్న సంగారెడ్డి కింది బజార్ చెరువు కట్ట

**ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి,తోపాజి..**

**సదాశివపేట మండలం రేజింతల్లో బతుకమ్మ ఘాట్ను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి.**



సంగారెడ్డి అక్టోబర్ 16 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువు కట్టపై బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ పరిశీలించారు. కట్ట పొడవునా చేపడుతున్న విద్యుద్దీపాలంకరణ, కట్ట అంచుల్లో బారికేడ్ల ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ ఘాట్లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసారి బతుకమ్మల నిమజ్జనం కోసం రెండు ఘాట్లను సిద్ధం చేస్తున్నామని, మెట్లకు రంగులు వేస్తున్నామని నిర్వాహకులు వివరించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన అవశేషాలను పూర్తిగా తొలగించినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.



వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా 32 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దీని తయారీకి 16 టన్నుల స్టీల్, అలంకరణకు ఎనిమిది టన్నుల పూలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఐదు డీజే పాయింట్లు, ఘాట్ల వద్ద ఐదు లైటింగ్ టవర్లతో సహా మొత్తం 18 లైటింగ్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే 32 అడుగుల స్క్రీన్, లేజర్ లైటింగ్తో పాటు చెరువు కట్ట చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపా అనంత్ కిషన్, నాయకులు బొంగుల రవి కూన సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

**రేజింతల్లో బతుకమ్మ ఘాట్ ప్రారంభం**

సదాశివపేట మండలం రేజింతల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ను గురువారం నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్ధన్న, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ గడీల ఆశిరెడ్డి, నందికంది సర్పంచ్ విజయ్ భాస్కర్ రెడ్డి, ఇశ్రితబాద్ సర్పంచ్ అనితా శ్రీనివాస్, మండల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

**ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం కీలకం.**

**రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్.**



సంగారెడ్డి, అక్టోబర్ 16 మనం న్యూస్ ప్రతినిధి : ఎల్నినో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు.

తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి వృథాను అరికట్టడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియో గించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్నినో పరిస్థితులను సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో పాటు ప్రజలు, రైతుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

శుక్రవారం గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీతతో కలిసి వాణి ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో సాగవుతున్న పత్తి, కంది, టమాట పంటలను పరిశీలించి, పత్తి సాగు చేస్తున్న రైతు బాల్రెడ్డితో మాట్లాడి పంటల పరిస్థితి, నీటి లభ్యత, సాగు వివరాలను తెలుసు

కున్నారు. ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్స్ నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు.

వీబీ-జీ రామ్జీ పథకం కింద పనిదినాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని, అవసరమైన చోట పంట విరామం పాటించేలా రైతులను ప్రోత్సహించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రానున్న రోజుల్లో ఎదురయ్యే నీటి సమస్యలపై ప్రజలకు వాస్తవిక పరిస్థితులను వివరించాలని తెలిపారు.

అనంతరం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన సంబంధిత అధికారులతో వాణి ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పంటల పరిస్థితి, వర్షపాతం, తాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం లభ్యత, భవిష్యత్తులో తలెత్తే సమస్యలను ఎదుర్కొనేందుకు రూపొందించాల్సిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలు చేతికొచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాబోయే యాసంగి సీజన్లో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని రైతులు ఆరుతడి పంటలు ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నీటి లభ్యతను అంచనా వేయకుండా వరి సాగు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని సూచించారు.

వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలవారీగా పంటల పరిస్థితిని పరిశీలించి, పంటల రక్షణకు రైతులకు తగిన సూచనలు అందించాలన్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల స్థాయి, బోర్లలో నీటి లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు.



గ్రామాలవారీగా తాగునీటి అవసరాలు, నీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని వాణి ప్రసాద్ సూచించారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నీటి సరఫరాలో వృథాను అరికట్టి, నీటిని పొదుపుగా వినియోగించుకునేలా వాటర్ రిసోర్సెస్ కమిటీలకు అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో నీటి సంరక్షణకు సంబంధించిన తీర్మానాలు చేయించాలని తెలిపారు.

రాబోయే 10-15 రోజులు పంటల రక్షణకు కీలకమని పేర్కొంటూ, అవసరమైన ప్రాంతాల్లో పంటలకు తగిన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రతి వారం సంయుక్త సమీక్ష సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో పశుగ్రాసానికి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా పశుగ్రాసాన్ని నిల్వ చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పశుగ్రాసం వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల అదనపు కలెక్టర్లు సంగీత, లక్ష్మి కిరణ్, అదనపు ఎస్పి చైతన్య రెడ్డి వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి, గుమ్మడిదల తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానానికి ఆదిదేవత...
# జగన్మాత శ్రీ విద్యాసరస్వతి



**సర్వ శక్తి సామర్థ్యాలను ప్రసాదించనున్న శ్రీ విద్యాధరి క్షేత్రంలో... వైభవంగా మూలా నక్షత్ర వైభవం పీఠాధిపతులు శ్రీ విద్యాశంకర నృసింహ భారతి**







వర్గల్ అక్టోబర్ 16(మనం న్యూస్):జ్ఞానానికి ఆదిదేవతగా జగన్మాత శ్రీ విద్యా సరస్వతి మాత ప్రసిద్ధికెక్కినట్లు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర నృసింహ భారతి స్వామీజీ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో మూల నక్షత్ర మహోత్సవం సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే శ్రీ విద్యాధరి క్షేత్రం భక్తులు, ఆరాధకులకు ఆకర్షణగా విలసిల్లుతోందని స్పష్టం చేశారు. జ్ఞాన సముపార్జనకు చదువుల తల్లి సంపూర్ణ ఆశీస్సులు పొందాలని, దీంతో విద్య, నైపుణ్యత, సృజనాత్మకత తదితర లక్ష్యసాధనకు మార్గం సుగమం చేసుకోవాలని ఆకాంక్షించారు. శక్తి స్వరూపంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ విద్యాధరి క్షేత్రా సర్వశక్తి సామర్థ్యాలను ప్రసాదిస్తుందని, ఈ క్రమంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించాలని వివరించారు. కాగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. మూలా నక్షత్ర మహోత్సవం పురస్కరించుకొని క్షేత్రంలో లక్ష పుష్పార్చన, పుస్తక రూపిని సరస్వతీ పూజ, చండీ హోమము తదితర అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, రెండు వేలకు పైగా అక్షర స్వీకారాలు జరిగినట్లు ఆలయ కమిటీ పేర్కొంది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేయగా, అమ్మవారి నామస్మరణతో క్షేత్ర సముదాయం మార్మోగింది.

## నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి
# ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రత్యేక పూజలు

**సదాశివపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు..**
**అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.**





సంగారెడ్డి అక్టోబర్ 16 మనం న్యూస్ ప్రతినిధి : దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. సదాశివపేట పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిజాంపురం కుటుంబ సభ్యులు అశోక్, రవి, నాగరాజు ఆధ్వర్యంలో, జైభవీ యూత్ మాజీ కౌన్సిలర్ ఆకుల శివ, దిద్దిగే నగేష్, కటకం కిరణ్, మల్లికార్జున, వంశీ, సాయిరాజు సేటు, ధనుంజయ్ గౌడ్, రచ్చన్న స్వామి, సారపు అభి, చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ను ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, శ్రీధర్ రెడ్డి, చింత సాయినాథ్, చీల మల్లన్న, నగేష్, కౌన్సిలర్ వైశాలి నాగరాజు గౌడ్, దిద్దిగే వినోద్, కొత్రికే సాయిరాజ్, తంగెడ్పల్లి లక్ష్మణ్, కంది మల్లేశం, పెద్ద గౌడ్, మల్లికార్జున శంకర్, కొత్త రామన్న, కోడూరు అంజయ్య తదితర స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.



# వర్గల్ పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుక పంపిణీ

**ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి**

వర్గల్ అక్టోబర్ 16 (మనం న్యూస్):దసరా పండగ వేళ వర్గల్ గ్రామపంచాయతీలో గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచే కార్మికుల శ్రమను గుర్తిస్తూ ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి సొంత ఖర్చులతో నగదు బహుమతులు అందజేశారు.శుక్రవారం వర్గల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మొత్తం 13 మందికి నగదు సుమారు రూ.16 వేల వరకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, 'గ్రామ పారిశుద్ధ్యం కోసం ఎండనకా వాననకా కష్టపడే కార్మికులకు పండగ వేళ అండగా ఉండాలనే ఉద్దేశంతో ఈ చిరు కానుక అందిస్తున్నట్లు తెలిపారు. వారి సేవలు ఎంతో గొప్ప వని అన్నారు. ఉపసర్పంచ్ చేసిన ఈ సహాయాన్ని గ్రామస్తులు, కార్మికులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ. మోహన్, వార్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, యశస్విని, ఆత్మ కమిటీ డైరెక్టర్ కిషన్ గౌడ్, సెక్రటరీ అన్నపూర్ణ వర్గల్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు కుమ్మరి నర్సింలు, కాంగ్రెస్ నాయకులు అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

# రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

వర్గల్ అక్టోబర్(16 మనం న్యూస్): మండల కేంద్రంలోని బుచ్చి రేణి కుంట వద్ద 100 కేవీఏ ట్రాన్స్ఫార్మర్ ఓవర్ లోడ్ తో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను విద్యుత్ అధికారులు డి.ఈ స్వామి, ఏడిఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేష్ లు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఓవర్ లోడ్ ను గుర్తించి వెంటనే అదనంగా 25 కెవిఎ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందించారు. చేతికి అంది వచ్చే పంట విద్యుత్ సమస్యతో రెండు ముఖం పట్టడంతో పంటను కాపాడేందుకు సకాలంలో స్పందించిన విద్యుత్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలకం

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**- అట్టహాసంగా ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బాలబాలికల రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు**



పటాన్ చెరు, అక్టోబర్ 16 (మనం న్యూస్) : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత రెండు రోజులుగా పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కుస్తీ పోటీలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ముగిసాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఈ పోటీలు క్రీడాభిమానుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, ఓటముల నుంచి పాఠాలు నేర్చుకున్నప్పుడే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎట్టయ్య, పృథ్వీరాజ్, రాజ్ కుమార్, రాము, షకీల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఘనంగా అన్నదానం

**- డాక్టర్ సీహెచ్. రామ, డాక్టర్ సీహెచ్. పరశురామ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం**

**- అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి**



మనం న్యూస్ - సిద్దిపేట రిపోర్టర్ అక్టోబర్ 16: శ్రీ దేవి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు,భారత్ నగర్ శ్రీ యోగి లింగేశ్వర ఆలయం దగ్గర లో అమ్మవారి 36వ వార్షికోత్సవం, దసరా ఉత్సవాలను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయి పల్లవి హాస్పిటల్కు చెందిన డాక్టర్ సీహెచ్. రామ, డాక్టర్ సీహెచ్. పరశురామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, భక్తి భావంతో నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో సుఖశాంతులు, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

అమ్మవారి 36వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

భక్తి, సేవాభావంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాయకం లక్ష్మణ్ వ్యవస్థాపక సభ్యులు, ఉపాధ్యక్షులు కుందరం శ్రీనివాస్ వ్యవస్థాపక సభ్యులు, చింత శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి, వకులాంబరణం అశోక్ కుమార్ వ్యవస్థాపక చైర్మన్, సహాయక కార్యదర్శి లు సిద్దుల శ్రీనివాస్, నాయకం నాగేందర్, కొత్త శ్రీనివాస్, వ్యవస్థాపక సభ్యులు, కోశాధికారి సిద్దుల శ్రీనివాస్ వ్యవస్థాపక సభ్యులు, కార్యవర్గ సభ్యులు నారోజు వెంకటాచారి, నాయకం కర్ణాకర్, రాచమెల్ల గట్టయ్య, బండారుపల్లి బైరయ్య, ఉండాడి యాదయ్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శనివారం మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

**గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్: చిన్న పాపని. కుమార్ గౌడ్.**



గుమ్మడిదల ( మనం న్యూస్) అక్టోబర్ 16 : గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో శనివారం నాడు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని. కుమార్ గౌడ్ తెలిపారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో వేడుకలు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఈ మేరకు అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వేడుకలు సజావుగా జరిగేలా మహిళలు, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగను సాంప్రదాయంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీ తరపున ఏర్పాట్లు చేస్తున్నట్లు కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల. సంధ్య గోవర్ధన్ రెడ్డి, వాటి కౌన్సిలర్లు రమేష్, సురభి. కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి

**ఎల్ నీ నో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరం.**

**రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి : వాణి ప్రసాద్.**

గుమ్మడిదల ( మనం న్యూస్ ) అక్టోబర్ 16 : ఎల్ నీ నో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వాణి ప్రసాద్ అధికారులను శుక్రవారం నాడు ఆదేశించారు. తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, నేటి వృధాను అరికట్టడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. ఎల్ ని నో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో పాటు ప్రజలు, రైతుల భాగస్వామ్యం అవసరమని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం నాడు గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో అడిషనల్ కలెక్టర్ టి.యల్. సంగీత తో కలిసి వాణి ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. పత్తి, కంది, టమాటో పంటలను ఆమె పరిశీలించి పత్తి సాగు చేస్తున్న రైతు బాల్ రెడ్డి తో మాట్లాడి పంటల పరిస్థితి, నీటి లభ్యత, సాగు వివరాలను తెలుసుకున్నారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. ప్రతి రైతు పొలంలో ఫామ్ పౌండు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని ఆమె అధికారులను సూచించారు. అనంతరం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన సంబంధిత అధికారులతో వాణి ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి, సిద్దిపేట అడిషనల్ కలెక్టర్లు సంగీత, లక్ష్మీ కిరణ్, వివిధ శాఖల అధికారులు, గుమ్మడిదల తహసీల్దార్ పరమేశం తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

**గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ : చిన్న పాపని. కుమార్ గౌడ్.**

గుమ్మడిదల ( మనం న్యూస్ ) అక్టోబర్ 16 : గుమ్మడిదల మున్సిపల్ పరిధి దోమడుగు గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోవాలని కౌన్సిలర్ నర్సంపల్లి. రాజిరెడ్డి ఆహ్వానం మేరకు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని. కుమార్ గౌడ్ వాటి కౌన్సిలర్లతో కలిసి దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు ఆయన తెలిపారు. అమ్మవారిని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బాధలో ఉన్న కుటుంబానికి కొండంత అండగా సిద్ధన్నపేట

**మానవత్వానికి నిలువుటద్దం సిద్ధన్నపేట గ్రామస్తులు**



నంగునూరు, అక్టోబరు 16 మనం న్యూస్ :- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ కుటుంబానికి సిద్దన్నపేట గ్రామస్తులు కొండంత అండగా నిలిచారు. తమకు తోచినంత సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామానికి చెందిన కాచగోని రాములు మూడు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతితో భార్య కళావతి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ముగ్గురు కూతుళ్లకు తండ్రి లేని లోటు తీరనిదిగా మారింది.

రాములు గతంలో గీత వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించేవాడు. ఆ ఆదాయం సరిపోకపోవడంతో ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించాడు. మరోవైపు భార్య కళావతి స్వగ్రామంలో బీడీలు చుడుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా దంపతులు వెనుకడుగు వేయలేదు. తమ ముగ్గురు కూతుళ్ల మహంతి, ప్రత్యూష, శిరీషలను కష్టపడి పెంచి పెద్ద చేశారు. కుటుంబ భవిష్యత్తు కోసం శ్రమించారు. ఎలాగోలా అప్పులు చేసి కూతుళ్ల పెళ్లిళ్లు జరిపించారు. మూడేళ్ల క్రితం గల్ఫ్ నుంచి స్వగ్రామానికి తిరిగొచ్చిన రాములు మళ్లీ గీత వృత్తిని చేపట్టి జీవనం సాగించాడు. అయితే విధి మరో రూపంలో దెబ్బతీసింది.

సంవత్సరం కిందట రాములు అనారోగ్యానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం అప్పులు చేసి చికిత్స చేయించారు. కొద్దిపాటి వ్యవసాయ భూమిని సైతం అమ్మి వైద్యం చేయించినా ఆరోగ్యం కుదుట పడలేదు. కొద్దిరోజులుగా మంచానికే పరిమితమయ్యాడు. చివరకు రెండురోజుల కిందట కన్నుమూశాడు. కుటుంబ పెద్ద మరణంతో కళావతి కుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయింది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమైన కుటుంబానికి ఈ ఘటన తీరని లోటును మిగిల్చింది. ఈ పరిస్థితిని చూసి చలించిపోయిన సిద్దన్నపేట గ్రామస్తులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. రాములు కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఒక్కొక్కరూ తమకు తోచినంత విరాళం అందించారు. అలా మొత్తం రూ.38,100 జమ చేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం రాములు భార్య కళావతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కత్తుల నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి, అన్న రాజయ్య, సిరికొండ భాస్కర్, బంక మహిపాల్, పొంటింగ్ తిరుపతి, బొల్లు తిరుపతి, ఎం.డి. ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆదుకున్న గ్రామస్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.ఆపదలో ఆదుకున్న ఆపన్న హస్తాలు కన్నీటిలో మునిగిపోయిన కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇచ్చాయి. రాములు తిరిగి రాకపోయినా, ఆయన కుటుంబానికి గ్రామస్తులు అందించిన ఆర్థిక సహాయం మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. కష్టం వచ్చినప్పుడు మనుషుల మధ్య ఉండాల్సిన అనుబంధం, ఆప్యాయత ఇంకా బతికే ఉన్నాయని సిద్దన్నపేట గ్రామస్తులు చాటిచెప్పారు.



# సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ దంపతులు, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.**

సంగారెడ్డి అక్టోబర్ 16 మనం న్యూస్ ప్రతినిధి: జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో జిల్లా పోలీసు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రకృతి అందాలు, ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆటపాటలతో వేడుకలను జరుపుకున్నారు. సంప్రదాయ పాటలు, కోలాటాలు, ఆటపాటలతో పోలీసు కుటుంబ సభ్యుల సందడి మధ్య వేడుకలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించే లా ఈ వేడుకలు నిర్వహించారు. కుటుంబసభ్యులంతా దరూ ఒకచోట చేరి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండు గను జరుపుకోవడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.





# గీతంలో ఘనంగా దండియా ఉత్సవం

**– శుభారంభ్ పేరిట గర్బా, దండియా నృత్యాలు, సంగీతం, సాంస్కృతిక సందడి**

పటాన్ చెరు, అక్టోబర్ 16 (మనం న్యూస్) : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, నవరాత్రి స్ఫూర్తిని పురస్కరించుకుని, 'శుభారంభ్ 2026' పేరిట ఉత్సాహభరితమైన దండియా ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి వేలాది మంది విద్యార్థులు రంగురంగుల సాంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు.

కళాకృతి విద్యార్థి క్లబ్ ఆధ్వర్యంలో, స్త్రీ శక్తి పర్యావరణ సామరస్యం, ప్రాంతీయ గుర్తింపునకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సంగీతం, నృత్యం, సాంస్కృతిక ఉత్సాహంతో నిండిన గర్బా, దండియా నృత్యాలతో ఈ వేడుకలు ఉత్సాహభరితమైన సాయంత్రంగా కొనసాగాయి. ఈ కార్యక్రమం, గీతం ప్రాంగణ సంస్కృతిని, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, విభిన్న విద్యా విభాగాలకు చెందిన విద్యార్థుల మధ్య ఐక్యతను, స్నేహభావాన్ని పెంపొందించింది.

శుభారంభ్, విద్యార్థులకు ఉమ్మడి సాంస్కృతిక అనుభవాల ద్వారా ఒకరితో మరొకరు మమేకమవడానికి, మధురమైన జ్ఞాపకాలను సృష్టించుకోవడానికి, కలిసికట్టుగా ఉండే ఆనందాన్ని పంచుకోవడానికి ఒక అవకాశాన్ని కల్పించింది.



# బతుకమ్మ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

**టి .మల్లికార్జున్ మున్సిపల్ కమిషనర్**

హుస్నాబాద్, రిపోర్టర్: అక్టోబర్ 16, మనం న్యూస్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను మున్సిపల్ ఛైర్పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ టి.మల్లికార్జున్ శుక్రవారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు ,పల్లె చెరువు వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని ప్రధాన బతుకమ్మ ఘాట్లు, చెరువులు, మహిళలు అధికంగా పాల్గొనే ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. పండుగ సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, బతుకమ్మ ఆడే ప్రదేశాలను పరిశుభ్రంగా



ఉంచాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారిణి నీరడి లావణ్యకు జాతీయ స్థాయి అవార్డు

జహీరాబాద్ అక్టోబరు 16 మనం న్యూస్: జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారిణి నీరడి లావణ్యకు జాతీయస్థాయి అవార్డు లభించింది. మహిళా రైతులను, వ్యవసాయ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ప్రోత్సహించడంలో భాగంగా ఏటా అక్టోబరు 15న జాతీయస్థాయిలో మహిళా కిసాన్ దివస్ కార్యక్రమాన్ని





నిర్వహిస్తూ, వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రోత్సహించడంలో భాగంగా ఏటా నిర్వహించి, జాతీయస్థాయి అవార్డును ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం తరఫున సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారిణి నీరడి లావణ్యకు జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ శాఖలో చేపడుతున్న వివిధ పథకాలను రైతులకు చేర్చడంలో, రైతులను నూతన సాగు పద్ధతుల వైపు మళ్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వివిధ కేటగిరీలపై తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచిన లావణ్యకు జాతీయ స్థాయి అవార్డు రావడం సంతోషించదగ్గ విషయం. జాతీయ అడిషనల్ సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ మహేందర్ కుమార్ దివేది ద్వారా ఆతిష్ చంద్ర చేతుల మీదుగా అవార్డును జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారిణి నీరడి లావణ్య అందుకున్నారు.

# కలెక్టరేట్లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు

**టి.ఎన్.జి.ఓ. యూనియన్, అన్ని శాఖల ఉద్యోగుల ఆటపాటలతో సందడిగా మారిన ప్రాంగణం**

**గౌరమ్మకు పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడిన అదనపు కలెక్టర్ సంగీత**







సంగారెడ్డి, అక్టోబర్ 16 మనం న్యూస్ ప్రతినిధి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంగారెడ్డి కలెక్టరేట్లోని అన్ని శాఖల ఉద్యోగులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. పాటలకు అనుగుణంగా మహిళా ఉద్యోగులు నృత్యాలు చేస్తూ సంబురాల్లో పాల్గొన్నారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులు ఒకచోట చేరి పండుగను సామూహికంగా జరుపుకోవడంతో కలెక్టరేట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

ఈ వేడుకల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా '' లలితాదేవి, టి జి ఓ జిల్లా అధ్యక్షులు డా ' వైద్యనాథ్ , జిల్లా టి.ఎన్.జి.ఓ. అధ్యక్షులు,మహిళా నాయకులు, కార్యవర్గం సభ్యులు ,కలెక్టరేట్లోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు , సిబ్బంది సాంస్కృతిక సారథి కళాకారులు, కలెక్టరేట్ సమీప కాలనీ మహిళలు పాల్గొన్నారు.



# హుస్నాబాద్లో కబడ్డీ అకాడమీ ఏర్పాటు

**40 మంది బాలబాలికలకు శిక్షణ, వసతి సదుపాయాలు**

హుస్నాబాద్, రిపోర్టర్: అక్టోబర్ 16, మనం న్యూస్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ 2026 అక్టోబరు 15న జీవో నంబరు 1660 జారీ చేసింది. అకాడమీ ద్వారా 40 మంది క్రీడాకారులకు శిక్షణ, వసతి సదుపాయాలు కల్పించనున్నారు. అకాడమీలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు అవకాశం కల్పిస్తారు. వీరికి శిక్షణ అందించేందుకు బాలురు, బాలికలకు వేర్వేరుగా కోచ్లను నియమించనున్నారు. అదేవిధంగా వేర్వేరు వార్డెన్లతోపాటు గ్రౌండ్స్మెన్, స్వీపర్, సెక్యూరిటీ గార్డు సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం ఎనిమిది సేవల నియామకానికి ప్రభుత్వం అనుమతించగా, ఔట్సోర్సింగ్ విధానంలో నియామకాలు చేపట్టనున్నారు.

**క్రీడాకారుల హర్షం...**

హుస్నాబాద్లో కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై స్థానిక క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ కృష్ణ నేతృత్వంలో పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. అకాడమీ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్కు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీపై ఆసక్తి ఉన్న బాలబాలికలకు ఈ అకాడమీ ద్వారా శిక్షణ పొందే అవకాశం లభించనుంది. మెరుగైన శిక్షణ, వసతి సదుపాయాలతో క్రీడాకారులు తమ ప్రతిభను అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందని స్థానిక క్రీడాభిమానులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో పీడీ ఆర్.శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వి.వెంకటరమణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్న రాజు, పీఈటీలు అజయ్, వంశీ, సీనియర్ క్రీడాకారులు ఎస్.రాజేష్, సతీష్ వర్మ, సాయికృష్ణ, కత్తుల రఘు, అభినవ్, రాంచరణ్, అశ్వంత్, దిలీప్కుమార్, లాస్యశ్రీ, శాన్వి తదితరులు పాల్గొన్నారు.



# దసరా పండుగకు ఊరెళ్ళేవారు జాగ్రత్తలు తీసుకోవాలి!

**జహీరాబాద్ పట్టణ ఎస్ఐ ఎన్ లవకుమార్ విజ్ఞప్తి**



జహీరాబాద్ అక్టోబరు 16 మనం న్యూస్: జహీరాబాద్ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని ప్రజలు ముఖ్యంగా దసరా పండుగ (విజయదశమి) నిమిత్తం ఊరెళ్ళే వారందరు పోలీసు శాఖ వారు సూచించే జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించవలసిందిగా ఆ స్టేషను ఎస్ఐ ఎన్ లవకుమార్ విజ్ఞప్తి చేశారు. దసరా పండుగ నేపథ్యంలో పోలీసుల సూచనలు పాటిస్తే ఏ సమస్య ఉండబోదని ఆయన చెప్పారు. దసరా సెలవుల్లో చాలామంది తమ,తమ ఇళ్లకు తాళాలు వేసి, జన్మించిన ఊరికెళ్ళుతారని (వెళ్లిపోతుంటారు) దీంతో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి దొంగలు, దొంగతనాలు చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అలాగే ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా భారీ నష్టానికి దారితీయొచ్చని ఆయన గుర్తు చేశారు. అందుకే ప్రయాణానికి ముందే ఇంటి తలుపులు, కిటికీలు సరిగ్గా మూసి ఉన్నాయో? లేదో? చెక్ చేసుకోండని ఆయన కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు సొమ్ము (నెట్ క్యాష్) బంగారు ఆభరణాలు ( గోల్డు ఐటమ్స్), ఇతర విలువైన వస్తువులను ఇంట్లో వదిలి వెళ్లొద్దని ఆయన స్పష్టం చేశారు. వీలైతే బ్యాంకు లాకర్లలో ఉంచుకోవడం మంచిదని (బెటర్) ఆయన సుస్పష్టం చేశారు. విజయ దశమి పర్వదిన సందర్భంలో ఊరికి వెళ్తుంటే పొరుగువారికి చెప్పడం మంచిదని కూడా ఆయన మరోమారు స్పష్టీకరించారు.ఈ విషయంలో అవసరమైతే జహీరాబాద్ పట్టణ పోలీసులకు,లేదా పోలీసు స్టేషను కు సమాచారం ఇవ్వండని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇంట్లో సీసీటీవీ కెమెరాలు ఉన్నాయా? వర్క్ చేస్తున్నాయో? లేదో? నన్ను విషయంలో తమ, తమ సీసీటీవీ కెమెరాలను చెక్ చేసుకోండని ఆయన కోరారు. అందుకే ఊరికి వెళ్లే ముందు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

సెలవులలో బయటకు వెలుతున్నప్పుడు సెక్యూరిటి అలారం, మోషన్ సెన్సర్ ను ఏర్పాటు చేసుకోవడం మంచిదని ఎస్ఐ ఎన్ లవకుమార్ అన్నారు.

తమ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళాన్ని అమర్చుకోవడం మంచిదని, త మ,తమ వాహనాలను తమ,తమ ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకొండని, తమ ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయండని,. మీకు వీలైతే చక్రాలకు చైన్స్ తో కూడా లాక్ వేయడం మంచిదని ఎస్ఐ పేర్కొన్నారు. 'నమ్మకమైన వాచ్ మెన్లను మాత్రమే సెక్యూరిటి గార్డులుగా నియమించు కోవాలని ఆయన కోరారు.

తమ ఇంట్లో అమర్చిన సీసీ టీవీ కెమెరాలను ఆన్ లైన్ లో ఎప్పటిక ప్పుడు చూసుకుంటూ ఉండాలని ఆయన చెప్పారు. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్ అండ్ పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలని,వాటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడుతారని ఆయన అభిప్రాయ పడ్డారు.మెయిన్ డోర్ కి తాళం కప్పు వేసినప్పటికి అవి కనిపించకుండా కర్టెన్స్ తో కవర్ చేయడం మంచిదని,

'బయటకు వెళ్ళేటప్పుడు ఇంటి లోపల కాని బయట గాని కొన్ని లైట్లు వేసివుంటే మంచిదని.తమ ఇంటి దగ్గర మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటి వద్ద ఉండమని చెప్పడం మంచిదని కూడా ఆయన చెప్పారు.

తమ ఇంటికి వచ్చే, వెళ్ళే దారులు.. ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చు కొని డీవిఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో ఉంచాలని అన్నారు.అల్మరా, కప్ బోరడ్స్ కు సంబంధించిన తాళాలు కామన్ ఏరియా అయిన చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల క్రింద, అల్మరా పైన, డ్రెస్సింగ్ టేబుల్ లో, కప్ బోర్డు లో ఉంచకుండా మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో ఉంచడం మంచిదని చెప్పారు.బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్ లకు.. గుడికి వెళ్ళేటప్పుడు తగు జాగ్రతలు తీసుకోండని కూడా ఆయన తెలిపారు.

'సోషల్ మిడియాలో మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడము మంచిది కాదని ఆయన అన్నారు. చైన్ స్నాచింగ్లు, టూవీలర్ వాహనాల చోరీలు, ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు పెట్రోలింగ్ చేస్తున్నారని ఆయన వివరించారు.

రాత్రి వేళల్లో మొబైల్ పెట్రోలింగ్తో పాటు బీట్ పోలీసుల ద్వారా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100 కు డయల్ లేదా జహీరాబాద్ పట్టణ పోలీసు వాట్సాప్ నెంబరు 8712656763 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ రాజగోపాలపేటలో ప్రత్యేక సంప్రదాయం

**ఆటపాటలతో మహిళల సందడి**

**పెద్ద చెరువులో బతుకమ్మల నిమజ్జనం**

నంగునూరు, అక్టోబర్ 16 మనం న్యూస్:- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. రంగురంగుల పూల అందాలతో పండుగ శోభను నింపారు. బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను రాజగోపాలపేట గ్రామస్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



**ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ**

రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. అయితే రాజగోపాలపేటలో మాత్రం ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ జరుపుకోవడం ప్రత్యేకతగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని గ్రామస్థులు కొనసాగిస్తున్నారు. తమ ఆచార వ్యవహారాలకు అనుగుణంగా పూల పండుగను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.

**ఆటపాటలతో సందడి.. చెరువులో నిమజ్జనం**

పలు రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు గ్రామ కూడళ్లలో పెట్టి కేక పూజలు చేశారు. వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడారు. చప్పట్లు కొడుతూ లయబద్ధంగా ఆడారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా రాజగోపాలపేట పెద్ద చెరువు వద్దకు తీసుకెళ్లారు. చెరువు గట్టున భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను ఆడిన అనంతరం నిమజ్జనం చేశారు.

**ఫలహారాల పంపిణీ..**

ఆత్మీయతకు ప్రతీక బతుకమ్మ వేడుకల అనంతరం మహిళలు, గ్రామస్థులు పరస్పరం ఫలహారాలు పంచుకున్నారు. ఆత్మీయతను చాటుకున్నారు. ఐకమత్యంతో పండుగను జరుపుకున్నారు. పూలను పూజిస్తూ ప్రకృతిని గౌరవించే బతుకమ్మ పండుగ గ్రామీణ జీవనంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. రాజగోపాలపేటలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ నిర్వహించే సంప్రదాయం గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తెస్తోంది. ఇలాంటి వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

## విద్యుత్తు సమస్యలపై సంగారెడ్డిలో నిర్వహించిన బీజేపీ నిరసన ర్యాలీకి తరలివెళ్లిన జహీరాబాద్ నేతలు

జహీరాబాద్ అక్టోబరు 16 మనం న్యూస్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో గురువారంనాడు రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల పరిష్కారం కోరుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో జహీరాబాద్ ప్రాంత బిజెపి నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్య క్షులు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బసవ లక్ష్మయ్య సూచనలతో, జిల్లా అధ్యక్షురాలు గోదారి అంజిరెడ్డి అధ్యక్షతన, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. సంగారెడ్డిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇక్కడినుండి తరలి వెళ్లిన వారిలో జహీరాబాద్ పట్టణ-2 బీజేపీ అధ్యక్షులు రమేష్ రెడ్డి బసంత్ పూర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ తోపాటు జహీరాబాద్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.



## సింగూర్ ప్రాజెక్టును అధికారులతో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే మాణిక్ రావు

జహీరాబాద్ అక్టోబరు 16 మనం న్యూస్: ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో సింగూరు ప్రాజెక్టును జహీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు సంబంధిత అధికారులతో కలిసి ఆ ప్రాజెక్టును సందర్శించి, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వలు, నీటి వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాజెక్టులోని నీటి నిల్వలు, భవిష్యత్తులో నీటి అవసరాలు, రైతులకు సాగునీటి లభ్యత వంటి అంశాలపై అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. నీటి వనరులను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, తాగునీటి అవసరాలకు, రైతుల సాగునీటి అవసరాలకు తగిన ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు నొక్కి వక్కాణించారు.



# రైతులను వంచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వై నరోత్తం**



జహీరాబాద్ అక్టోబరు 16 మనం న్యూస్:తమది రైతు ప్రభుత్వమని, రైతులకు కావలసిన సాగు నీరు, 24 గంటల విద్యుత్తును నిరంతరం అందిస్తామని ప్రగల్భాలు పలికి ఎల్ నీనో అని బూచి చూపెట్టి రైతులకు సాగునీరు కరెంట్ ఇవ్వడం లేదని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వై నరోత్తం ఆరోపించారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను వంచిస్తోందని ఆయన విమర్శించారు. రాష్టం మొత్తం తీసుకొంటే 127.58 లక్షల ఎకరాలకు 1276టిఎంసిల నీరు అవసరముండగా 590.57 టిఎంసి లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, 268 టిఎంసిలు భూగర్భ జలాలతో సాగు చేయాల్సి ఉందని, వీటిని తీయాలంటే విద్యుత్తు అవసరమని ఆయన గుర్తు చేశారు.ఎల్ నీనో వస్తున్నదని గత 9 నెలల క్రితం తెలిసినా అవసరమగు సాగు నీరును కాళేశ్వరం నుండి తీసుకోలేదని ఆయన చెప్పారు. రాష్టానికి 19892 మెగావాట్ల విద్యుత్తు అవసరముండగా మన దగ్గర ఉత్పత్తి అయ్యేది కేవలం 9015 మెగావాట్లు మాత్రమేనని ఆయన తెలిపారు. ఎల్ నీనో ప్రభావం వల్ల విద్యుత్తు ఉత్పత్తి అయ్యేది ఎక్కువగా బొగ్గు నుండేనని ఆయన చెప్పారు.ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా పడటం వల్ల విద్యుత్ ఉత్పత్తి 1000మెగావాట్ల వరకు తగ్గ వచ్చు ప్రభుత్వం సరైన రీతిలో ఆలోచిస్తే యాదాద్రి దగ్గర ఉన్న ధర్మల్ ప్లాంట్ (వైటిపిఎస్)పూర్తి సామర్థ్యం 4000 మెగావాట్లు ఈ లోటు తిరేదని వివరించారు. ప్రభుత్వం ముందస్తుగా ఆలోచిస్తే ఈ పవర్ ప్లాంటును పూర్తిగా రన్ చేసేది, గోదావరిలో ఉన్న నీటిని నిల్వ చేసేది, విద్యుత్తును ప్రత్యామ్నా యంగా కొనుగోలు చేసేది కానీ అవన్నీ ఏమి చేయకుండా ఎల్ నీనో అనే భూచి చూపెట్టి రేవెంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను వంచిస్తున్నదని ఘాటుగా వ్యాఖ్యానించారు. జహీరాబాద్ నియోజకవర్గ పరిస్థితి చుస్తే ఇక్కడ 2,10,000 ఎకరాల సాగు చేసే వారు, అందులో 30 శాతం అనగా సుమారు 65 వేల ఎకరాల్లో సాగు నీటితో పంటలు పండిస్తారు మిగతా అంత వర్షాధిత ఆదార పంటలే వేస్తారు 64వేల ఎకరాలలో 3000 ఎకరాలు చెరువులు కుంటాలతో పండిస్తారని, మిగతా అంతా భూగర్భ జాలాధారమే అంటే వీటికి విద్యుత్తు అవసరం కానీ ఆ విద్యుత్తును ప్రభుత్వం సరైన రీతిలో సరఫరా చేయడం లేదని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల కరెంటు అన్నారు కానీ ఆనాదికారంగా 12 గంటలు మాత్రమే ఇస్తున్నారని వివరించారు. అది కూడ నాణ్యమైన విద్యుత్తు సరఫరా ఎక్కడ లేదని ఆయన అన్నారు. అందులో ప్రతి రోజు 10 నుండి 12 సార్లు కరెంటు కోతలు విదిస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

నియోజకవర్గానికి 250 మెగావాట్ల ఫిక్ లోడ్ అవసరముండగా దాంట్లో 50శాతం కూడ సప్లయి చేస్తలేరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

9నెలల క్రితమే ఎల్ నీనో వస్తున్నది తెలిసిన సింగూర్ నీటిని మొత్తం వదిలి పెట్టారని, అది ఎండి పొగ చుట్టు ప్రక్కల భూగర్భ జలాలు అడుగంట్టడం వల్ల రైతులు తమ చేతికి వచ్చిన పంటకు నీళ్లు అందించ లేక పోతున్నారని ఆయన వాపోయారు. మోటర్లు కాలిపోతున్నాయని, రైతుల పరిస్థితి ఆగమ్యాచోరంగా తయారైందని ఆయన చెప్పారు. విటన్నిటికీ కారణం ప్రభుత్వ ముందు చూపు లేకపోవడమేనని ఆయన గుర్తు చేశారు. ఇక నైనా ప్రభుత్వం తమ తప్పును సరిదిద్దుకొని, రైతులకు సరిపడా సాగునీరు, విద్యుత్తు అందించాలని డిమాండు చేశారు. లేని ఎడల ప్రజాగ్రహానికి గురికాక తప్పదని అన్నారు.ఈ కార్యక్రమంలో కేతకి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ హన్మన్న పాటిల్,మాజీ సర్పంచి శంకర్, నాయకులు రామచంద్రారెడ్డి, శివకుమార్, ఎస్ గోపాల్, ఎం మల్లేశం, వీర్ సంగప్ప, రాజశేఖర్ శెట్కార్,పవన్ రాతోడ్,తదితరులు పాలోన్నారు

# వ్యవసాయ రంగానికి సక్రమంగా విద్యుత్తు సరఫరా చేయాలి

**కరెంట్ కోతలతో ఎండిపోతున్న పంటలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు**




జహీరాబాద్ అక్టోబరు 16 మనం న్యూస్: వ్యవసాయ రంగానికి సక్రమంగా విద్యుత్తు సరఫరా జరిగేలా చూస్తూ, ఏ కోతల్లేని నాణ్యమైన విద్యుత్తును నిరంతరం సరఫరా చేయాలని, జహీరాబాద్ ప్రాంత రైతాంగ సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు డిమాండు చేశారు.

బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ వ్యవసాయ రంగానికి నిరంతరంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. శుక్రవారంనాడు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరికి నీరందడం ఎంతో ముఖ్యమని, కొన్ని రోజులుగా విద్యుత్తు కోతలు విధిస్తుండడంతో పంటలు ఎండిపోయి అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందోయ?, ఎప్పుడు పోతుందో? తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బోర్లు, బావుల కింద సాగవుతున్న కొద్దిపాటి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోయారు.రోజంతా కలిపితే 6 నుంచి 7గంటల కరెంటు సరఫరా కావడం లేదని ఆయన గుర్తు చేశారు. అందులో అప్రకటిత కోతలు విధిస్తున్నారని మండి పడ్డారు. లోవోల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చినంక పాలమూరు జిల్లాలో ఒక్క ఎకరానికైనా కొత్తగా సాగునీరు ఇచ్చారా? ఒక్క చెక్డ్యామ్ కట్టారా? ఒక్క చెరువునైనా బాగుచేశారా? అని ప్రశ్నించారు.నెట్టెంపాడు ప్రాజెక్టుల్లో 24 గంటలు నడుపాల్సిన మోటర్లను 7-8 గంటలే నడిపి నీళ్లు ఎత్తకపోవడం వల్ల చివరి ఆయకట్టుకు నీళ్లందక పంటలు ఎండిపోయి జనం వలసబాట పట్టారని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులను, వాటి మోటర్లను కూడా నడుపడం కాంగ్రెస్కు చేతకావడం లేదని మండిపడ్డారు.కరెంట్ కోతల వల్ల పంటలు ఎండిపోతున్న రైతులకు తక్షణ సహాయం అందించాలి.కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలి.విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు నిల్వలు, సరఫరా పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలిమని, విద్యుత్తు అధికారులపై చర్యలతో సరిపెట్టకుండా, ప్రభుత్వ స్థాయిలో జరిగిన ప్రణాళికా లోపాలపై సమీక్ష జరపాలని,రైతులకు నిరంతర విద్యుత్తు అందించే కార్యాచరణను గడువుతో ప్రకటించాలని డిమాండు చేశారు.వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్తు సరఫరా చేయని యెడల బిఆర్ఎస్ పార్టీ తరుపున రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జి గుండప్ప యాదవ్, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ జి విజయ్ కుమార్, ఝురాసంగం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నర్సిములు,ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, కౌన్సిలర్లు దీపక్, మొహమ్మద్ జాకీర్,మహిపాల్ యాదవ్, విశ్వేశ్వర్,నాయకులు చంద్రు,కరణ్ తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ ఏర్పాట్లుపై ప్రత్యేక దృష్టి

**గ్రామ సర్పంచ్ మడప పద్మ జైపాల్ రెడ్డి**

హుస్నాబాద్,రిపోర్టర్: అక్టోబర్ 16,మనం న్యూస్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచన పెల్లి గ్రామం తెలంగాణ సంస్క ృతి సంప్రదాయ సాంప్రదాయాలకు నిలయంగా అయినా బతుకమ్మ వేడుకలు ఏర్పాట్లు సర్పంచ్ మడప పద్మ జైపాల్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రాజమ్మ, ఉప సర్పంచ్ ఇంద్రాల సత్యం, సభ్యులు, బండి శ్రీనిధి, మంద రజిత, గూళ్ల తిరుపతి, ఖాతా విజయ, కూరెల్ల సంతోష్, మామిడి సాగర్, బూర్గు శ్యామల బతుకమ్మ ఆడే ప్రదేశాన్ని ప్రత్యేకంగా క్లీన్ చేయించి విద్యుత్ దీపాలు అలంకరించారు.పారిశుధాన్ని నిర్వహించారు. తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రతి పేదకు

**- సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్**

**తోర్నాల్ గ్రామ పంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

మనూర్, అక్టోబర్ 16 (మనం న్యూస్):నారాయణఖేడ్ నియోజకవర్గం సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం తోర్నాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.

**కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పాలన:**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది.

**ప్రభుత్వం చేపడుతున్న ప్రధాన పథకాలు:**

- మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం,
- 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (గృహజ్యోతి),
- రూ. 500 లకే గ్యాస్ సిలిండర్,
- ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కల నెరవేర్పు,
- రైతులకు రైతు భరోసా, రూ. 2 లక్షల వరకు రుణమాఫీ,
- రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ,
- క్యూఆర్ కోడ్, అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులు.



ఈ కార్డుల వల్ల నకిలీ కార్డులకు చెక్ పడి, అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా రేషన్ సరుకులు అందుతాయి. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి ఆదేశాల మేరకు తోర్నాల్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఈ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా పని చేస్తోందని, తోర్నాల్ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు, స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబోజి, జిపివో ఏవన్, పంచాయతీ కార్యదర్శి సంగీత మేడం, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు కాలేద్, సంగయ్య స్వామి, విట్టల్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్య పరిరక్షణకు ప్రోత్సాహం



జహీరాబాద్ అక్టోబరు 16 మనం న్యూస్: జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ఎస్ వి జ్ఞానేశ్వర్ ఆయుర్వేద ఆసుపత్రిని శుక్రవారంనాడు స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానం ప్రాముఖ్యతను, సహజ చికిత్సా పద్ధతుల ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జి గుండప్ప, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ జి విజయ్ కుమార్, ఝురాసంగం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం, వివిధ పార్టీల నాయకులు గొల్ల భాస్కర్ యాదవ్, అర్షద్ జమా పటేల్, తదితరులు పాల్గొన్నారు.



# తండ్రి 'కాట దర్శన్ గౌడ్' జ్ఞాపకార్థం..








**గౌడ్ హాస్టల్కు కాంగ్రెస్ నేత 'కాట' రూ.5 లక్షల విరాళం**

**- విద్యార్థుల భవిష్యత్తుకు అండగా కాట శ్రీనివాస్ గౌడ్**

**- తండ్రి పేరుతో గదిని ప్రారంభించిన నేత**

**- గౌడ విద్యార్థులు ఉన్నతంగా చదవాలి.. గౌరవంగా బతకాలి**

**- నందిగామ గౌడ్ హాస్టల్ను సద్వినియోగం చేసుకోవాలి**

**- హాస్టల్-నందిగామ రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తా**

**- కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్**

పటాన్చెరు, అక్టోబర్ 16 (మనం న్యూస్): సామాజిక సేవలో తన వంతు బాధ్యతగా, గౌడ సామాజిక వర్గం విద్యార్థుల ఉన్నత విద్యకు తోడ్పాటునందించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గ

ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముందడుగు వేశారు. తన తండ్రి కాట దర్శన్ గౌడ్ జ్ఞాపకార్థం పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో నిర్మించిన గౌడ్ హాస్టల్ భవనానికి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు.

హాస్టల్ భవన నిర్మాణం పూర్తికావడంతో శుక్రవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ తన తండ్రి కాట దర్శన్ గౌడ్ జ్ఞాపకార్థం హాస్టల్ భవనంలో ప్రత్యేకంగా నిర్మించిన గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గౌడ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు హాస్టల్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని, విద్యతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కాట శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. విద్యతోనే సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని సాధించవచ్చని కాట శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. గౌడ్ హాస్టల్ నిర్మాణం కోసం 20 గుంటల విలువైన స్థలాన్ని అందించిన దాత దొంతి లక్ష్మీనారాయణ గౌడ్ను ప్రత్యేకంగా అభినందించారు.

**రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి..**

గౌడ్ హాస్టల్ నుంచి నందిగామ గ్రామానికి వెళ్లే రహదారి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కాట శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి రైతులతో మాట్లాడి సమన్వయం చేసుకుంటానని తెలిపారు. రహదారి అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్లకు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, టీఎస్ టీసీఎఫ్సీ చైర్మన్ మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్, టీ. వీరేందర్ గౌడ్, పల్లె రవి, పటాన్చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, నందిగామ సర్పంచ్ విక్రమ్ గౌడ్, గౌడ్ హాస్టల్ అధ్యక్షుడు చక్రవర్తి గౌడ్, స్థలదాత దొంతి లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ మార్కెట్ 1996 బ్యాచ్ ఉద్యోగులకు పాత పెన్షన్ సాధన కోసం ఐసిఈయూ నిరసన ప్రదర్శన

**జహీరాబాద్ అక్టోబరు 16 మనం న్యూస్:** ఓపెన్ మార్కెట్ 1996 బ్యాచ్ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండు చేస్తూ, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ కార్పొరేషన్ యూనియన్ (ఐసిఈయూ) సికింద్రాబాద్ డివిజన్ వారి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.1996 బ్యాచ్ ఓపెన్ మార్కెట్ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయడం న్యాయమైన హక్కని, ఉద్యోగుల భవిష్యత్తు భద్రతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండు చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని కూడా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిఈయూ జహీరాబాద్ బ్రాంచి అధ్యక్షులు అశోక్, కార్యదర్శి టి శ్రీనివాస్ పాల్గొని, ఉద్యోగుల పెన్షను సమస్యపై తమ సంఘీభావాన్ని తెలియజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో చంటి, అశోక్, జమున, అర్చన, అంజలి, షాఖిల్, మోహన్, రమణ్, శరత్, దిలీప్, అలీం తదితర సిబ్బంది పాల్గొని పాత పెన్షన్ సాధనకు తమ మద్దతు ప్రకటించారు.1996 బ్యాచ్ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేసే వరకు ఐక్య పోరాటాన్ని కొనసాగిస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.




## ఘనంగా జరుపుకున్న ఇరిగేషన్ ఈఈ జన్మదిన వేడుకలు

జహీరాబాద్, అక్టోబరు 16 మనం న్యూస్: జహీరాబాద్ ఇరిగేషన్ డివిజన్ 2 కార్యనిర్వాహక ఇంజనీర్ విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఇరిగేషన్ కార్యాలయంలో ఆ శాఖ సిబ్బంది కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్, రాయికోడ్, న్యాల్కల్, మొగుడంపల్లి ఉప కార్య నిర్వాహక ఇంజనీర్లు శుక్లజా కళ్యాణం, వెంకటేశ్వర్లు, జనార్దన్ రావు, సుజాత, టెక్నికల్ డి ఈ ఈ జ్యోత్స్న, సహాయ ఇంజనీర్ లు జానకిరామ్, శ్రీనివాస్, స్టాలిన్, శ్రీలత, సాయికృష్ణ, కార్తికేయ, అయూబ్, దీపిక, వెంకన్న, చందన, లావణ్య, సూపరింటెండెంట్ వెంకట్ రెడ్డి, ఉమా సింధూరి, రిబికా, గిరి, గంగాధర్, తులసి, సుధారాణి, శంకరయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ లు రఘు, జహీర్, ప్రసాద్, ఆఫీస్ సబార్డినేట్ లు ప్రవీణ్, మానయ్య, సాయి, ప్రవీణ్, మోహన్, షబానా బేగం, యాస్మిన్ బేగం, పూలమ్మ , అంజన్న తదితరులు పాల్గొన్నారు.

